క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి



ముత్తంశెట్టికి ప్రసాదం అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరం పూజ నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

నమో శివరుద్రాయ



ఉమాచంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామికి బిల్వపత్రాలతో పూజలు చేశారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. హర నామ స్మరణలో మునిగితేలారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

వెంకటాద్రిపై ప్రత్యేక పూజలు



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న సీఐ రామకృష్ణ, కుటుంబ సభ్యులు

పెందుర్తి: వెంకటాద్రిపై సోమవారం విశేష పూజలు నిర్వహించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ కుటుంబ సమేతంగా వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

విశ్రాంత ఉద్యోగుల సమావేశం రేపు

పరవాడ: స్థానిక మరిడి మాంబ కల్యాణ మండపంలో ఈ నెల 28న ఉదయం 9 గంటలకు ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం నిర్వహించడం జరుగుతుందని సంఘ అధ్యక్షుడు ఆదిరెడ్డి సన్నిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అనకాపల్లి, అగనంపూడి, పరవాడ శాఖల ప్రతినిధులు విధిగా పాల్గొని విజయవంతం చేయాలని సన్నిబాబు కోరారు.

త్వరలో తాగునీటి సమస్యకు చెక్



చింతగట్లలో మంచినీటి పథకానికి శంకుస్థాపన చేస్తున్న కనకరాజు

పెందుర్తి: మండలంలోని చింతగట్ల పంచాయతీ నందవరపువానిపాలెంలోని ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించేందుకు రూ.10 లక్షలతో నిర్మించనున్న మంచినీటి పథకానికి రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి నాటికి ఈ పథకాన్ని ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు నందవరపు అప్పలరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి: బంటాకాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం మంగళవారం పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. రవినగర్, అప్పలనర్సయ్య కాలనీ, బంటాకాలనీ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

రామచంద్రమ్మ పండగకు సర్వం సిద్ధం



వినాయకుని ఆలయం సెట్టింగ్



మూడు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన అమ్మవారి భారీ సెట్టింగ్, రామచంద్రమ్మ అమ్మవారు



పూలతో అలంకరించిన అమ్మవారి ఆలయం

- 14 గ్రామాల ఆరాధ్య దేవత
- విస్తృత ఏర్పాట్లు చేసిన ఉత్సవ కమిటీ

పరవాడ: మండలంలోని ప్రధాన పండగల్లో ఒకటైన శ్రీరామచంద్రమ్మ పండగను అట్టహాసంగా నిర్వహించడానికి సర్వం సిద్ధమైంది. వాడచీపురుపల్లి దరి 14 శివారు గ్రామాల ప్రజల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటోంది. అమ్మవారి పండగను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించడానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. దలాయిపాలెంలో కొలువుదీరిన శ్రీరామచంద్రమ్మ అమ్మవారి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలు, పూలతో ముస్తాబు చేశారు. ఆలయం నుంచి పోలిపల్లి కూడలి వరకు రోడ్డుకిరువైపులా కళ్లు మిరమిట్లు గొలిపేలా విద్యుత్ తోరణాలు ఏర్పాటు చేశారు. వాడ చీపురుపల్లి కూడలిలో ఏర్పాటు చేసిన భారీ సెట్టింగులు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. హాస్టల్ వద్ద ఏర్పాటు చేసిన భారీ సెట్టింగు, మూడు రోడ్ల జంక్షన్‌లోని ఆర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. గ్రామ పుర వీధుల్లో ఆధ్యాత్మిక భావం కనిపిస్తోంది.

విశేష ఏర్పాట్లు

అమ్మవారిని దర్శించుకొనే భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో షామియానాలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఉచిత ప్రసాదం, మంచినీరు, మజ్జిగ సరఫరా చేయనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధి ఎస్.వి.శ్రీనివాసరావు చెప్పారు. వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ కల్పించారు. భక్తులు మంగళవారం వేకువ జాము నుంచి అమ్మవారిని దర్శించుకోనున్నారు. పసుపు కుంకుమలు సమర్పించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. సంతబయలులో సాయంత్రం నిర్వహించే పల్లకీ ఊరేగింపు పండగలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ ఊరేగింపు కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొంటారు.

హోరెత్తించనున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మంగళవారం రాత్రికి భక్తుల కోసం భారీ స్థాయిలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సెంటర్‌లో రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా, రోబోటిక్ డ్యాన్స్, అంబేడ్కర్ కాలనీలో డ్యాన్స్ మస్త్, మాసవరపు వీధిలో విశాఖ థిల్లర్స్, గండివారి వీధిలో కరుణా ఈవెంట్స్, బీసీ కాలనీలో సినీడూపర్స్, కాన్వెంట్ వద్ద శంకర్ మాట్రిక్స్,"సినీడూపర్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దలాయిపాలెంలో డ్యాన్స్ హంగామా, పోలిరెడ్డిపాలెంలో బుర్రకథ, గొరుసువానిపాలెంలో రేలారే రేలా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ చైర్మన్ మాసవరపు అప్పలనాయుడు చెప్పారు. పండగలో భాగంగా నిర్వహించిన వాలీబాల్, షటిల్ , కర్రసాము పోటీల్లో గెలుపొందిన విజేతలకు మంగళవారం రాత్రి బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు.



వీధుల్లో ఏర్పాటు చేసిన రంగు రంగుల విద్యుత్ తోరణాలు



వాడచీపురుపల్లి కూడలిలో ఏర్పాటు చేసిన శివపార్వతుల ఆర్చి



చిడతల పోటీలను తిలకిస్తున్న ప్రజానీకం

చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు



అమ్మవారి పండగలో భక్తులకు అసౌకర్యం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాడచీపురుపల్లి, దలాయిపాలెం ఆలయం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. పండగలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేండా ప్రత్యేక జాగ్రత్తలు చేపట్టాం. అశ్లీల నృత్యాలు, జూదం, లాటరీ బల్లలు వంటి వాటికి తావులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నాం. చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు.

– ఎస్.బాలసూర్యారావు, సీఐ, పరవాడ

పెందుర్తి గెలుద్దాం.. జగనన్నకు కానుకగా ఇద్దాం



సిద్ధం సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, తిప్పల గురుమూర్తిరెడ్డి, నాయకులు

- మార్చి 3న వేపగుంట వేదికగా 'సిద్ధం' సభ
- పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

పెందుర్తి: పెందుర్తి గెలుద్దాం..జగనన్నకు కానుక ఇద్దాం అనే నినాదంతో ప్రతి కార్యకర్త పనిచేయాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. 'మార్చి మూడు పెందుర్తి చూడు' నినాదంతో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి సిద్ధం సభ సన్నాహక సమావేశాన్ని సోమవారం పెందుర్తిలోని తాండ్రపాపారాయుడు కల్యాణ మండపంలో నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ పరిశీలకుడు తిప్పల గురుమూర్తిరెడ్డి చేతుల మీదుగా సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో పేద బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచారన్నారు. మళ్లీ అలాంటి పాలన కొనసాగాలంటే సీఎంగా తిరిగి వైఎస్ జగన్ మాత్రమే కొనసాగాలని స్పష్టం చేశారు. ప్రత్యర్థులు ఎంత మంది కలిసినా సీఎం వైఎస్ జగన్ ఒంటరిగానే బరిలో ఉన్నారని... ఆయనకు కార్యకర్తలే బలం అన్నారు. వేపగుంటలో మార్చి 3న మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానున్న పెందుర్తి సిద్ధం సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్, సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోడిగుడ్ల దేవిసాంబ, జోన్-8 జేసీఎస్ చైర్మన్ మనాలత జోబ్‌దాస్, పీఏసీఎస్ చైర్మన్ శరగడం నరసింహమూర్తి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొరపల్లి శ్రీను, పార్టీ సీనియర్ నేతలు ఉప్పిలి కనకరాజు, ఆదిరెడ్డి మురళి, బోకం రామునాయుడు, చుక్కా రామునాయుడు, బి.ఎన్. రాజు, పెదిశెట్టి శేఖర్, మెంటి మహేష్, దాడి ఉమామహేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



గణపతిపురంలో ఊరేగింపుగా తీసుకువెళ్తున్న మల్లికార్జునస్వామివారి ఉత్సవ విగ్రహాలు

సబ్బవరం: మండలంలోని పెదనాయుడుపాలెం గ్రామం శివారు గణపతిపురంలో కొలువైన గణపతి భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామివారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు సోమవారం ఘనంగా జరిగింది. స్వామివారి పసిడి కలశ, నవగ్రహ,నందీశ్వర,కాలభైరవస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు దారిపొడువనా అభిషేకాలు చేశారు. ఇరువాడ జంక్షన్‌లోని శివాంజనేయ ఆలయం నుంచి గణపతిపురం వరకూ ఉత్సవ విగ్రహాల ఊరేంగింపును కనుల పండువగా నిర్వహించారు.

బాణ సంచా, మహిళల కోలాటం పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రక్ష సూత్రధారణ,మండపం ఆవాహన పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు ప్రసాదాలను స్వీకరించారు.

నేడు సీతారాముల వార్షిక కల్యాణోత్సవం



సీతారాముల ఉత్సవమూర్తులు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు సింహపురికాలనీలోని శ్రీ సీతారామాలయ 21వ వార్షిక కల్యాణ మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు రామ్మోహనరావు జ్యోతి ప్రజ్వలన-హనుమత్ పతాక ఆవిష్కరణ చేసి మహోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆలయ అర్చకులు అర్చకులు యాగశాల ప్రవేశాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు సకల దేవతలకు కల్యాణ ఆహ్వానం పంపిస్తూ ధ్వజారోహణం, రాత్రి 7 గంటల నుంచి సీతారాముల వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. 28న ఉదయం 9.30 నుంచి సుదర్శన నారసింహ హవనం, సాయత్రం 5 గంటల నుంచి స్వామివారి గ్రామ తిరువీధి నిర్వహిస్తారు. 29న 9.30 గంటలకు శ్రీ మద్రామాయణ సామూహిక పారాయణం, సాయంత్రం 6.30 గంటలకు కోలాటం, మార్చి1న ఉదయం 9.30 గంటలకు శ్రీ మహాలక్ష్మీ సామూహిక కుంకుమార్చన, 2న ఉదయం 10 గంటల నుంచి స్నపనం, చక్రస్నానం, వసంతోత్సవం, పూర్ణాహుతి, అవబృత స్నానం, సాయంత్రం 6గంటల నుంచి శ్రీపుష్పం,ఉంగాం, ఊంజల్‌సేవ, ఋత్విక్ సన్మాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులంతా ఈ ఉత్సవాల్లో పాల్గొని స్వామివార్ల ఆశీస్సులు పొందాలని కోరారు.

శ్రీవారికి పుష్పయాగం



ఊంజల్ సేవలో ఆలయ ధర్మకర్త తిప్పల రమణారెడ్డి, అన్నపూర్ణ దంపతులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్‌లోని వెంకటాద్రిపై వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 19 నుంచి నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ నెల 19న పంచాహ్నికదీక్షతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ ధర్మకర్త తిప్పల రమణారెడ్డి, అన్నపూర్ణ దంపతుల ఆధ్వర్యంలో ప్రతి రోజూ స్వామి వారికి ఆరాధన, నిత్య హోమాలు నిర్వహించారు. ఈ నెల 20న స్వామి వారి 18వ తిరు కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆ రోజు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఉత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వారిని సోమవారం ప్రత్యేకంగా అలంకరించారు. పుష్పయాగం, ఊంజల్‌సేవ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి సేవలో తరించారు.

యువతతోనే భారత్ అభివృద్ధి సాధ్యం



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎంపీ జీవీఎల్, రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూక్యాంపస్: భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడంలో యువత పాత్ర కీలకమని ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఏయూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సోమవారం టి.ఎల్.ఎన్ సభా మందిరంలో నిర్వహించిన యువ సంవాద్ సమావేశం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విజేతలు సర్టిఫికెట్లు ప్రదానం చేసి మాట్లాడారు. దేశం ప్రథమం అనే విధంగా యువత నడుచుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ నాక్ గ్రేడింగ్‌లో ఏయూ అత్యుత్తమ స్థానం సాధించడంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు, సేవలు ఉపయోగపడ్డాయన్నారు. ఉదయం జరిగిన ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ యువత దేశం కోసం కలలు కనాలని, వాటిని సాకారం చేసే దిశగా పని చేయాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ ప్రధాని మోదీ సూచించిన పంచ్‌ప్రాణ్ సూత్రాలను అంతా పాటిస్తూ వికసిత్ భారత్‌ను ఆవిష్కరించాలన్నారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ పౌరులు బాధ్యతాయుత ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా వర్సిటీ స్థాయిలో పంచ్ ప్రాణ్‌పై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో 30 మంది యువతీ యువకులు పాల్గొని తమ భావాలను, ఆలోచనలను పంచుకున్నారు. వక్తృత్వ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, ఇ.పి.ఎస్ భాగ్యలక్ష్మి, వై.అనసూయ దేవిలను సత్కరించారు.

అయోధ్యలో నృత్య ప్రదర్శనకు పెందుర్తి కళాకారులు



సాధన చేస్తున్న కళాకారులు

పెందుర్తి: అయోధ్య రామ మందిరం ప్రాంగణంలో నృత్య ప్రదర్శన చేసే అరుదైన అవకాశాన్ని చినముషిడివాడలోని నిర్మలా నృత్యనికేతన్ విద్యార్థులు సొంతం చేసుకున్నారు. బాలరాముని చెంత ప్రదర్శన ఇచ్చేందుకు నృత్య నికేతన్ ప్రిన్సిపాల్ బి.విజయజ్యోతి సారథ్యంలో కళాకారులు బయలుదేరారు.

29న జనరిక్ మందుల షాపు ప్రారంభోత్సవం

సబ్బవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జనరిక్ మందుల షాపును సబ్బవరంలోని శ్రీదుర్గమాంబ కో ఆపరేటివ్ సొసైటీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేయనున్నట్లు కోఆపరేటివ్ బ్యాంక్ సీఈవో గొంప రమణ తెలిపారు. ఈ నెల 29న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఈ మందుల షాపును ప్రారంభిస్తారని చెప్పారు. ఆయనతో పాటు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కోలా గురువులు, ఎంపీపీ బోకం సూర్యకుమారి, మండల ప్రత్యేక అధికారి పీఎస్ఎల్ కిరణ్ కుమారి, డీసీసీబీ సీఈవో డీవీఎస్ వర్మ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

విశాఖ ఉక్కు జోలికి వస్తే చరిత్ర హీనులవుతారు



1,110వ రోజు దీక్షలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తే చూస్తూ ఊరుకోబోమని, విశాఖ ఉక్కు జోలికి వస్తే చరిత్ర హీనలువుతారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్ష సోమవారం నాటికి 1110వ రోజుకు చేరుకున్నాయి. సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీలకు అండగా సీఎం వైఎస్ జగన్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనారిటీలకు అండగా నిలిచారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పెందుర్తి ద్రోణంరాజు నగర్ సమీపంలోని నిర్మించనున్న నూర్ బాషా బీసీ ముస్లిం దూదేకుల సంక్షేమ సేవాసంఘ భవనానికి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ముస్లింలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సంఘం ప్రతినిధులు షేక్ పీర్‌సాహెబ్, షేక్‌ఖాన్ సాహెబ్, షేక్ షఫీ, షేక్ సాహుల్, సాదన్ ఇస్మాయిల్, అబ్దుల్లా, మదీనా, భాష, రెహమాన్, మున్నా, సాధిక్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు ఎనిమిది వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హేమవతి

పెందుర్తి: వేపగుంటలోని జీవీఎంసీ జోన్-8 ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పలు సమస్యలపై ఎనిమిది వినతులు వచ్చాయి. అక్రమ నిర్మాణాలు, ఇతర సమస్యలపై జోనల్ కమిషనర్ హేమవతికి ఫిర్యాదు చేశారు. జెడ్సీ మాట్లాడుతూ సమస్యలపై తక్షణమే స్పందించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. జోన్-8 పరిధిలోని అన్ని విభాగాల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజా రవాణాతో పర్యావరణానికి మేలు



ఆర్టీసీ బస్సులో కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి



కార్యాలయానికి సైకిల్‌పై వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. సోమవారం ఆమె తన క్యాంప్ ఆఫీస్ నుంచి జీవీఎంసీ కార్యాలయానికి ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో చేరుకోగా.. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో కాలుష్య నియంత్రణకు వారంలో ఒక రోజు జీవీఎంసీ ఉద్యోగులతోపాటు అందరూ ప్రజా రవాణాను వినియోగిస్తున్నామని తెలిపారు. ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన చర్యలు చేపడుతోందన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించాలని కోరారు.